
# రైలుపెట్టెలో ప్రయాణిస్తున్నాం



మా కాలేజికి సెలవులు వదిలారు. ఊరు వెళ్లాలి. త్వరత్వరగా సామాను సర్ది మిత్రులు నారప్ప, పీరాన్, కుళ్లాయప్ప, జక్కన్నలతో కాచిగూడ స్టేషన్ రాత్రి 9 గంటలకు చేరాము. అప్పటికప్పుడే టికెట్లకోసం క్యూ ఏర్పడుతూఉంది. పురాణాల్లో హనుమంతుని తోక, ద్రౌపది కోక అనేవిమాత్రం అంతంలేకుండా పెరుగుతూ ఉంటాయని తెలుసుకాని ఈ ఆధునిక కాలంలో క్యూలనుకూడా వాటితో చేర్చవలసివస్తుందని అనుకొంటూ నేనూ క్యూలో చేరిపోయాను.

టికెట్ తీసికొని ప్లాటుఫారంపైకి వెళ్లాను. రకరకాల వ్యక్తులు, అన్నిరకాల దుస్తులు, అలంకరణలు సరేసరి. వివిధ భాషల సంభాషణలు, తినుబండారాలు అమ్మే అబ్బాయిల కేకలు, వాటితో పిల్లల ఏడ్పులు, [illegible]కి సమతూకంగా అక్కడక్కడ నవదంపతుల చిరునవ్వులు, ట్రాన్సిస్టర్లలో అతి శ్రావ్యగానం, కూలీల హడావిడి. ఆ నాటి ప్లాటుఫారం వ్యవహారం సామాన్యమానవునికి శతావధానంలా ఉంది.

రైలు వచ్చింది. హడావిడి మరింత హెచ్చింది. మా మిత్రులం అంతా కలిసి దగ్గరలో ఉన్న థర్డు క్లాసు కంపార్టుమెంటుపైకి దాడిచేశాం.

తలుపుదగ్గర ఎక్కేవారు దిగేవారిని దిగనివ్వడం లేదు. దిగేవారు, పాపం, దిగలేక ఎక్కేవారిని ఎక్కనివ్వలేక పోతున్నారు. ఫలితం — రైలుపెట్టెలో ఉన్నవారు ఉన్నవారుగానే ఉండిపోయారు. ఇక మా మిత్రుడు పీరాన్ ఆధునిక శిల్పకళలో అందెవేసిన చెయ్యికనక కిటికీ బట్వాడా ప్రారంభించాడు. ముందుగా నా ట్రంకు తోశాడు. ఇంకేం! నాకు స్థలం దొరికిందన్న మాటే. ఆ తరవాత నేనుకూడా తిన్నగా కిటికీద్వారానే లోపలికి పోయాను. అప్పటికి స్ఫురించింది, చిన్నప్పుడు కిటికీలగుండా క్లాసునుండి జారుకోవడం నేడెంతగానో ఉపకరించిందని. నేను ఎక్కిన కంపార్టుమెంటుకు ముందువైపు ఫస్టుక్లాసు, వెనుకవైపు థర్డుక్లాసులు ఉన్నాయి, స్వతంత్ర భారత ప్రజాస్వామిక పాలన యంత్రాంగంలో సెంట్రల్, స్టేట్ ప్రభుత్వాలున్నట్లు. నేను ఎక్కిన కంపార్టుమెంటును, హైదరాబాద్‌లోని ఒక మధ్యతరగతి ఉద్యోగి బాడుగఇంటితో పోల్చడానికన్న, విష్ణుదేవుని వామనావతారం అంటే సరిపోగలదు. ప్రయాణం చేయునివారికోసమై, ముచ్చటగా మూడు భాషల్లో "15 మంది ప్రయాణీకుల కోస"మని రైల్వేవారు వ్రాశారు. ఇందులో 15 మందికి స్థలమున్న దని, అత్యవసర పరిస్థితుల్లో 150 మందికికూడా స్థలం ఉండగలదని వారికి తెలుసు కాబట్టే టికెట్లు ఎన్నైనా ఇస్తూనేఉంటారు. అందుకేనేమో సినిమాల దగ్గర జరిగే బ్లాకు ఇక్కడ ఉండదు. రైలు కదిలింది.

కె. ఎమ్. డి. శాస్త్రి

దేశంలోని ప్రజాస్వామ్యాన్ని ఒక్క రైలు పెట్టెతో పోల్చి చూస్తే 'ఔరా, నిజమే' అనిపిస్తుంది. రైలులో సీటులున్నవారు, లేనివారు రెండు పక్షాలు. వారి కక్షలు తాత్కాలికమే. అందరి లక్ష్యం ఒక్కటే. అయిదు స్టేషన్లు దాటితే అయిదేళ్ళు గడిచిపోయినట్లే. కష్టాలకు అలవాటు పడిపోవడం ప్రజలకు ఎలా అలవాటైందో, వారిని పట్టించుకోకపోవడమూ ప్రభుత్వానికి అనవాయితీ అయింది.

---

మా సహృదయమిత్రుల వీడ్కోలుతో నా ప్రయాణ ఘట్టం ప్రారంభమైంది.

ట్రంకుపెట్టెపై కూర్చొని ఒక్కసారి అలా కలయజూశాను తోటిప్రయాణీకులవైపు. ఏ పూర్వపుణ్యమోగాని ఇన్నిరకాల వ్యక్తులు ఇలా ఒక్క పెట్టెలో ఇమిడిపోయారు. ఇందులోని దృశ్యం, వైవిధ్యంతో కూడిన ఆధునిక చిత్రకళలాగ ఉంది. అప్రయత్నంగా మానవశరీరం వివిధ భంగిమలను ఆనాడు చూడగల్గాను. అటువక్కచూస్తే, తన్ను తాను మరిచి నిద్రిస్తూంది ఒక వనిత. ఆమె పాదాల దగ్గిర ఆవిడ భర్తగారు పాపం ద్వాపరయుగంలో కృష్ణపరమాత్మునికోసం పాదాల దగ్గిర పడిగాపులు కాచిన అర్జునుణ్ణి జ్ఞాపకంచేస్తూ ఉన్నాడు. వారి సీటుకు ఎదురుగా, భార్య భుజాగ్రంపై తన శిరస్సునుంచి వల్లమాలిన దాంపత్యవైభవంతో తోటిప్రయాణీకులకు ఈర్ష్య కలిగిస్తూ ఉన్నాడొక నవ్యయుగ సతీవ్రతుడు. ఇటువక్క చూస్తే ఒక తండ్రి తన 25 ఏళ్ల అబ్బాయి తలను ఒళ్లో ఉంచుకొని నిద్రపుచ్చుతూ తన పుత్రవాత్సల్యాన్ని కంపార్టుమెంటంతా నింపేస్తున్నాడు. ఈ రైల్వేవారు ప్రయాణీకులకు ఆటంకమైతే పొగ తాగరాదనిమాత్రం శాసించారుగాని ఈ దృశ్యాలనెవ్వరు సెన్సారు చేసేది?

అదీగాక ఈమధ్య ఆడవారు మాంచి ప్రయాణ పద్ధతి కనిపెట్టేశారు. ఆడవాళ్లకు ప్రత్యేకించిన పెట్టెలో ఎక్కరు. ఇద్దరు ఆడవారు చేరిన స్థలం యుద్ధరంగంగా మారగలదని వారికి బాగా తెలుసు. కాబట్టే హాయిగా మగవాళ్ల పెట్టెలో నిశ్చింతగా ఎక్కేస్తారు. దానితో వాళ్ల ప్రయాణపు కష్టాలు సైతం గట్టెక్కినట్లే. ఇక్కడ వాళ్లకు సకలవిధములైన సదుపాయాలు సవ్యంగా సాగుతాయి. కూర్చునేదానికే కాదు, అలా పడుకు వాల్చేదానికికూడా స్థలం ఇచ్చి తాము నిలబడతారు పాపం, తాత్కాలిక పరోపకార బుద్ధిగల మగరాయుళ్ళు. నన్నడిగితే, తెలియక ఈనాటి భారతీయ వనితామణులు పురుషులతో సమానమయిన హక్కులకోసం పోరాటం సాగిస్తున్నామని ఆరాట పడుతున్నారేగాని తరిచిచూస్తే భారతదేశంలో వనితకున్న విలువ, గౌరవం మరేదేశంలో ఉంది? ఉద్యోగాల్లోనేమి, టికెట్ల క్యూలవద్దనేమి, ప్రయాణాల్లోనేమి, "ఎందెందు వెదికి చూచిన సందేహము వలదు, మగవారి కన్న మగువలదే పైచెయ్యి కలదు" అని మా మిత్రుడు ఒకసారి అన్నాడు, నేటి కవిత్వధోరణిలో.




రైలు వేగం హెచ్చింది. పైన పడుకొన్నవానిని ఉద్దేశించి, నా పక్కన బుట్టతో నిల్చున్న వ్యక్తి బుట్ట ఉంచేందుకు పైన స్థలం ఇమ్మని అడిగాడు. ఇదే భారతీయ ధూమశకట ప్రయాణంలో సమర ఘట్టానికి నాంది. శయనించిన శేషశైలవాసుడు అన్నాడు కదా: "సికింద్రాబాదులో మూడు గంటలు పడిగాపులు కాచి, రైల్వేపోర్టరు చేతికి మూడురూపాయలిచ్చి, ముందుగానే రిజర్వు చేసికొన్నాను. నేను లేచేదానికే కాదు, నీవు సామాను ఉంచేదానికికూడా వీల్లేదు" అంటూ ఖచ్చితంగా చెప్పేశాడు.

"అలాగైతే రైల్వేపోర్టర్లగుండానే రైలుబండినే కొనివేయవచ్చునే!" అని అనేశాడు మరొకడు.

రైలుబండికీ, దేశానికీ సామ్యం ఉంది. దేశంలో ధనవంతులు, బీదవారు అనే రెండు ముఖ్యమైన తెగలు ఉన్నట్లే, ఇక్కడ సీట్లు కలవారు, లేనివారు అని రెండు పార్టీలుంటాయి. ఇరుపక్షాలవారికీ బద్ధవైరము. మొదటి పార్టీలో చేరాలంటే కంపార్టుమెంటులో సీటు దొరకాలి. సీటు దొరకనివారంతా రెండవ పార్టీవారే. నేనుకూడా ప్రవేశరుసుము లేకుండానే రెండవ పార్టీలో చేర్చబడ్డాను. బుట్టవ్యక్తి, పక్కన సీటుపైన కూర్చొన్న వ్యక్తుల్ని జరుగుకొమ్మని సౌమ్యంగా అడిగాడు. వాసేమిరా వీలులేదన్నారు. "5 మంది కూర్చోవలసిన జాగాలో ముగ్గురే ఉన్నారు కదయ్యా, జరుగుకొంటే స్థలం ఉంటుంది" అంటూ కాస్త ప్రాధేయపూర్వకంగా అడిగాడు. సగానికి మడిచిన బెడ్‌హోల్డాల్‌పై హాయిగా ఆనుకొంటూ "మేము టికెట్లు తీసికొని కూర్చున్నామయ్యా! ఇద్దరు పైన పండుకొని ఉన్నారు. ముగ్గురత

క్రింద కూర్చోవలసివస్తుంది. 5 మందికి పైగా ఆ సీట్లపై కూర్చోకూడదు. నెంబర్లు చూశావు గదా! 6, 7, 8, 9, 10" అని పల్లెటూరివానికి వయోజన విద్య నేర్పే పంతులులాగ చెప్పాడు. అందుకు మా పార్శ్వవాడు ఊరుకోక "మేమూ టికెట్లు కొన్నామయ్యా ఊరికే ఎక్కలేదు. అలాంటప్పుడు మా కెందుకు సీటు లేదు?" అని అడిగాడు.

"ఏమో, మీ టికెట్లతో సీటు లేకపోవచ్చు. ఓపిక ఉంటే టికెట్లు ఇచ్చినవారినే పోయి అడగండి. వీలుంటే వారినే పిలిపించుకొని స్థలం ఇప్పించుకోండి. మాకేం అభ్యంతరం లేదు" అని నిక్కచ్చిగా చెప్పాడు.

"సామాను తక్కువ, సుఖం ఎక్కువ. ప్రయాణానుభవాన్ని స్వర్గతుల్యం చేసుకోండి" అంటూ రైల్వే పోస్టర్లు అగుపిస్తాయికాని రైల్వేవారికి ఈ వాస్తవ పరిస్థితులు ఎలా అర్థమవుతాయి? "ప్రయాణీకులు ఎక్కువ, స్థలం తక్కువ. ప్రయాణం నేరుగా స్వర్గానికే" అన్న భావం వారి కెందుకు స్ఫురించడంలేదు. టికెట్ కలెక్టర్లు వచ్చి టికెట్లు తనిఖీ చేస్తారుకాని ప్రయాణీకుల సాధకబాధకాలు విచారించేవారేరి? కనీసము ఈ రైల్వేపోలీసులు చేసే పనేమిటి? ఇక్కడ వ్రాయ కూడదనుకోండి. స్థలం ఉన్నంతలో ప్రయాణీకులను సర్దవచ్చుగదా!

పోలీసులంటే జ్ఞాపకం వచ్చింది. లోగడ ఒక కవయిత అన్నట్లు పోలీసులు ఇంద్రధనుస్సువంటివారట! వర్షం అయిన వెంటనే ఎలా ఆకాశంలో ఏర్పడుతుందో అలాగే వీరు దెబ్బలాటలు అయినవెంటనే ప్రత్యక్ష మవుతారట! నన్నడిగితే వీరివల్ల అలజడి ఎక్కువవుతుందే కాని తగ్గదు. నేను ప్రత్యక్షంగా చూసిన ఉదంతం చెబుతాను. ఒకసారి పబ్లిక్ గార్డెన్సులో 'ఆత్మగౌరవం' షూటింగ్ జరుగుతూంది. దాదాపు మేమంతా 200 మందిమి చేరి చూస్తున్నాము. మా అదృష్టంకొద్దీ ఆ వేళకు పోలీసులు లేరు. నటుడు నాగేశ్వరరావు రాజశ్రీతో చాలా హుషారుగా నాట్యం చేస్తున్నాడు. అంతలో అకస్మాత్తుగా ఎక్కడనుండి ఊడిపడ్డారో (బహుశా నరకంనుండి) అనవసరంగా "వెనక్కి జరగండి — అటే ఇంకా వెనక్కి" అంటూ లాఠీకర్రలతో పోలీసులు ప్రత్యక్షం. ఇంకేముంది, ఒకటే గలాటా. తెలుసుగా, ప్రజలసమూహం తేనెతుట్టవంటిది. కదిపితే ఊరు కుంటుందా? అక్కడికి షూటింగ్ ఎలా జరిగిందో మాకు తెలియదుగాని పోలీసుల సంఘర్షణమాత్రం బాగా జరిగింది. వీరి సేవలను గుర్తించికాబోలు ఆంధ్ర రాజధానినగరులో విద్యార్థిప్రపంచం వీరి కొక బిరుదాన్ని ప్రసాదించింది. అదే "ఖట్‌మల్".

సరే, మా పార్శ్వవాడి ఉద్రేకం తగ్గినట్టు లేదు. ప్రభుత్వాన్ని దుయ్యపట్టేందుకు ప్రారంభించాడు. "ఎక్కడ చూచినా సోషలిజం, ప్రజాస్వామ్యం అంటూ ప్రభుత్వం కేకలువేస్తుందేకాని పెద్ద రైలుపెట్టెలో స్థాపించగా లేనిది విశాల భారతావనిలో ఎలా సాధ్యమవుతుంది?" అన్నాడు. నా పక్కనున్న వ్యక్తి "ప్రభుత్వాన్ని ఎందుకు దుయ్యపడతావు? అదేమి చేస్తుంది?" అంటూ సానుభూతివాక్యాలు పలికాడు. "అవును. ఏమి చెయ్యలేకపోతుందనే కదయ్యా నేను చెప్పింది" అని సమర్థించుకొన్నాడు తన వాదాన్ని మొదటివ్యక్తి.



నర్తకి

చిత్రం—బి. ఏ. రెడ్డి (గోల్కొండ)

"ప్రజాస్వామ్యమంటే మనకు మనమే మనల్ని పరిపాలించుకోవడం. మనఅవసరాలనుమనమేతీర్చుకోవాలి. రైలుపెట్టెలో ప్రజాస్వామ్యం లేదంటావా? కాస్త ఓపిక పట్టండి" అంటూ మాకు అవల దొడ్డివైపుగా ఉన్న తాతయ్యగారు చెప్పారు. తెల్లని పొడుగాటి గడ్డం. చేతిలో చిన్న సంచీ. చాలా ప్రశాంతంగా ఉంది ముఖారవిందం.

"రండి, తాతయ్యగారూ! ఇలా కూర్చుందురూ!" అని ట్రంకు సీటుపైకి ఆహ్వానించాను. రైలు తనలోని సంఘర్షణలను సైతం మరిచి తనపని తాను చేసుకొంటూ గమ్యంకోసం వెళుతూంది, రాష్ట్రంలో యన్. జి. ఓ. లాగు. ప్రయాణీకులు దాదాపు మాటలు కట్టేసి కాస్త కునుకు తీసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. బండి 4 స్టేషన్లు దాటింది ఆగకుండానే. బయట వాతావరణం చల్లగా ఉంది. రైలు చక్రాలతో బాటు కాలచక్రంగూడా కదిలిపోతూంది.

ఇంతలో మైమరిచి నిద్రిస్తున్న మగువకు మెలకువ కలిగింది. దొడ్డి ఉన్నవైపు చూసింది. భర్తతో చెప్పింది కాబోలు. అతను మా దగ్గిరికి వచ్చి "దోటు ఇవ్వండి మా ఆడవారు దొడ్డికి పోవాలి" అంటూ కాస్త ప్రభుత్వధోరణితోనే అడిగాడు. స్థలంలేదంటూ నిర్లక్ష్యంగా జవాబిచ్చారు ఇవతలి పార్శ్వవాళ్ళు.

"ఎందుకుండదయ్యా కాస్త సర్దుకోండి" స్వరం తగ్గించి అడిగాడు. "అవునయ్యా, మొదట్లో మేము మిమ్మల్లను సర్దుకొమ్మని అడిగినప్పుడు మీరు సర్దుకొని ఉంటే స్థలమెందుకు ఉండకపోయ్యేది? ఇప్పుడేం చేస్తాం — స్థలం బొత్తిగా లేదు." అంటూ చిన్న లా పాయింట్ విసిరాడు దిగాలుపడిన భర్తగారిపై. అక్కడ ఆవిడగారు తొందరపాటులో ఉన్నారు. ఈలోగా కూర్చున్న మరి ఇద్దరికి కూడా దొడ్డి అవసరం కలిగినట్లుసూచనప్రాయంగా మాగుంపువారికితెలిసింది. ఇంకేం! మరింత పటిష్ఠంగా ఉన్నారు. ఇంతలో మా పార్శ్వవారికి దొడ్డి అవసరం కలిగింది. మేమంతా సర్దుకొని వాడు పోయేందుకు స్థలం ఇచ్చాము. ఇది వారికి

కంట్లో కారం చల్లినట్టయింది. కాదామరి? ఆకలిని కాస్సేపు అరికట్టవచ్చు. వివాహాన్ని ఆజన్మాంతం అరికట్టిన వాళ్ళున్నారు కాని దీని విషయం? ఎంతసేపని ఆగగలం? ఆవిడ భర్తగారు తిరిగి ముందుకు వచ్చి "మీకు మాత్రమేకాదు దొడ్డి. అందరికీ హక్కు ఉంది పోయేందుకు. స్థలం ఇవ్వండి." దబాయింపుగానే అడిగాడు.

"అవునా! మీ టికెట్లలో సీట్లు మాత్రం ఇచ్చారు. మా టికెట్లలో దొడ్డిమాత్రం ఇచ్చారు. ఓపికఉంటే వారినే పిలిపించుకొని మలమూత్ర విసర్జనశాల ప్రవేశమహోత్సవం దివ్యంగా చేయించుకోండి! మాకేం అభ్యంతరంలేదు. మేము ఒక అంగుళంకూడా జరిగేందుకు వీలులేదు." అంటూ మరీ నిక్కచ్చిగా చెప్పేశాడు మా పార్టీవాడు. రైల్వేపెట్టె శాసనసభా వ్యవహారం మాదిరి రసపట్టులో ఉంది. శేషశైలవాసునికి చెప్పరాని కోపం వచ్చింది. "ఎందుకు విడవరు, నే చూస్తా" నంటూ దిగాడు. ఇంతలో గడ్డంతాతయ్య మా పార్టీవాడికి సైగచేసి పైనకూర్చోమన్నాడు. అలాగే మావాడు ఎక్కికూర్చున్నాడు. దొడ్డిసంగతి దేవుడెరుగు. అసలు సీటుకే మోసం వచ్చిందని ఎక్కిన వ్యక్తిని దిగమన్నాడు. వాడన్నాడుకదా "నేను పోర్టరుకు నాలుగు రూపాయలిచ్చాను. స్థలం దొరికినవెంటనే పట్టుకోమన్నాడు. పోయి, వాణ్ణి అడుగు." అంటూ తనకుతానే సర్దుకొని కూర్చున్నాడు. గడ్డంతాతయ్య "పోనిలేవయ్యా! అతనుకూడా పాపం నీలాగే డబ్బిచ్చాడట. డబ్బిచ్చి ఇంతసేపు నిలబడ్డాడు. అతన్ని కాస్సేపు కూర్చోనివ్వరాదటయ్యా! ఇప్పుడు మునిగిపోయిందేమి లేదులే!" అంటూ సర్దేశాడు. అంతటితో ఊరుకోక మా పార్టీవాణ్ణి ఉద్దేశించి "లేవయ్యా లే వారికి దారి కావాలి — ఆ సీటుపై కూలబడవయ్యా" అని అతన్ని కూలవేశాడు సీటులో. ఇవతలి ఇద్దర్ని ఉద్దేశించి "అడ్డంలెండయ్యా ఆడపడుచు వస్తోంది. పోయి ఖాళీగా ఉన్న సీట్లపై పడుదురూ" అని వాళ్ళిద్దరిని అలా తోశాడు. బట్టతల వ్యక్తిపై చిరుకోపాన్ని ప్రదర్శించి "ఎక్కినప్పటినుంచి ఊరికే వాగేదానికన్నా ఆ ఇద్దరిమధ్య కాస్త చోటు చేసుకోకూడదూ!" అంటూ అతన్ని తరిమివేశాడు. నా పక్కగానున్న దొడ్డికి పోయేవ్యక్తికి చోటు ఇవ్వరాదూ. అంతవరకు వ్యక్తినిచూచి, "అలా అడ్డంగా నిలబడేదానికన్నా ఆ ఆయన సీటుపక్కన కూర్చోరాదటయ్యా — ఆయన పోయేందుకు స్థలమైనా దొరుకుతుంది" అని "అమ్మా రండి వెళుదురుగాని" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించే వరకీ మా అవతలిపార్టీ వారికళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి. ఇక మా పార్టీ విషయం వేరుగా వ్రాయాలా? "చూశావా! అబ్బాయి దేనికైనా ఓపిక పట్టాలి. కాలం కలిసిరావాలి. రైలుపెట్టెలో ప్రజాస్వామ్యం లేదంటావా? దీనికైతే అయిదు నిమిషాలకాలం చాలు; దేశానికైతే అయిదు ఏళ్ళు కావాలి. ఇంతే తేడా! తెలిసిందా మనల్ని మనమే పరిపాలించుకోవలసింది? ఈపాటి ప్రజ్ఞకు ప్రభుత్వం ఎందుకు?" అంటూ చిరునవ్వు విసిరాడు. నిజమని పించింది. ఈలాంటి వ్యక్తులు మంత్రులెందుకు కారాదు? అలాగైతే రైలుపెట్టెలో ప్రజాస్వామ్యం మాట?

ఇంతలో బండి స్టేషన్‌లో ఆగింది. ★



సంబరం

ఫోటో — బ్రహ్మదేవ్ (డేరాడూన్)

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ముఖ్య గమనిక

మాకు పంపే వ్యాసాలు, కథలు, చిత్రాలు వగైరాలతోపాటు తగినన్ని స్టాంపులు అంటించి, తమ అడ్రసు వ్రాసిన కవరు పంపాలి. అలాంటప్పుడే ప్రచురించలేనివాటిని వెనక్కు పంపడం జరుగుతుంది.

ఆమోదించినవాటి విషయం వారికి తెలియపరుస్తాము.

స్టాంపులతో కవర్లు పంపకుండా తర్వాత వాటి విషయమై ఉత్తరాలు వ్రాస్తే ప్రయోజనంలేదు.

—ఎడిటర్